# బ్రతుకు తీపి

డబుల్ డెక్‌లో పైన ముందుసీట్లో కూర్చుంటే, ఏనుగుమీద కూర్చున్నట్లుంది. దివిటీలు, కాగడాలు పట్టుకుని వెంట నడుస్తున్న సైనికుల్లా స్ట్రీట్ లైటు స్తంభాలు - కార్లు, సైకిళ్ళు, రిక్షాలు; ఫుట్‌పాత్‌లమీది మనుషులు; రథబలం, కాల్బలం లాగా, బిల్డింగ్స్ బాల్కనీలలో నిలబడిన యువతులు; మేడలపై నుండి పూల వర్షం కురిపించేందు కొచ్చిన పడతులు ....

ఏ మహారాజునో అయి వూరేగుతున్నట్లు - నేను. "టికట్ ప్లీజ్" - అంటూ కండక్టరు, విధి నిర్వహణలో .... ! డబ్బు లిచ్చి తీసుకున్నాను.

ఛీ! నాకూ, దేనికీ సంబంధం లేదు. సికింద్రాబాద్ నుండి చార్‌మినార్ చేరే దాకానే ఈ బస్సుకు, నాకు సంబంధం - తర్వాత ఏమీలేదు. బంగాళాలపై కనిపిస్తున్న ఆడాళ్ళతోనూ. సైకిల్ రిక్షాలతోనూ, స్ట్రీట్ లైట్లతోనూ సంబంధం లేదు. నేనేదో వూరేగుతున్నట్లు పొందే అనుభూతికి, నా నిజస్వరూపానికి, స్థితికి సంబంధం లేదు.

ఎవరితోనూ, దేనితోనూ సంబంధం లేదనుకుంటే, మనసు హాయిగా వుంది. ఈరోజు ఏదో మంచిపని చేయబోతున్నాననే సంతృప్తి వుంది. స్ట్రీట్ లైట్లవల్ల నగరం అందంగా కనిపించడం కాదు, నాకళ్ళే వెలుగుతున్నాయ్. ప్రపంచంలో కొచ్చిన ముప్పయేళ్ళలో ఎన్నడూలేని ఈ ఆనందం; తుఫాన్లన్నీ వచ్చి పొయ్యాక ఏర్పడ్డ ప్రశాంతత లాంటిది.

ముఖం తుడుచుకుందా మనుకున్న యత్నంలో, నొసటికి తాకిన సీసా ... ! దానిమీద "టిక్ టొంటి" అని, ఇంగ్లీషు అక్షరాలు అందంగా కనిపించాయి. గజి బిజి అక్షరాల సమస్యల వాక్యం చివర ఫుల్‌స్టాపులా - నా జీవితానికి ఈ టిక్ టొంటి.

నా చేతిలో ఈసీసా చూస్తున్న వాళ్ళంతా ఏమనుకుంటారు? నల్లుల కోసం తీసుకెళ్తున్నా ననుకుంటుండొచ్చు - పిచ్చివాళ్ళు! నిజం గ్రహించలేరు. అందరూ నిజం గ్రహించేలోగా ఎవ్వరికీ అందకుండా పోతాను. అటు ప్రక్క సీట్లో కూర్చున్న అమ్మాయి, నన్నెందుకలా చూస్తోంది? ప్రక్కనున్న యువకుడితో చెప్తోంది ఏమిటో? ఆ అమ్మాయింకా ఇంటి కెళ్ళనట్టుందే, స్కూలు డ్రెస్‌తో ఈ రాత్రి దాకా తిరగడమేమిటి? ...

హారతి తనతో తిరిగేదికాదూ? అవును హారతి! మ్యూజిక్. కాలేజీ నుండి బస్‌స్టాప్ దాకా, రోజూ .... నడుస్తూ .... చీకట్లో ... చీకట్లోనే నడుస్తూ, ప్రేమికు లందరికీ ఆదర్శప్రాయంగా వుందామని అంది .... ఇంకేమేమో అంది ....

ప్చ్ .... ! లాభంలేదు.

ఓ మొగుణ్ణి చేసుకుని, యిద్దర్నికని 'యిప్పటికైనా ఓ మంచి అమ్మాయిని పెళ్ళి చేసుకుని హాయిగా వుండు' - అని చెప్పాక కూడా మొదట్లో అన్న మాటలు జ్ఞాపకం చేసుకోవడంలో అర్థం లేదు.

అందుకే, ప్రక్కసీట్లోని కుర్రదానికి కుర్రాడికి యింకా తెలియదు - ఈ జీవితాలకు అర్థం లేదని, అసలు జరగబోయే నిజాల విషపు విషయాల్ని చెప్పి, ఆ రెండు గొంతుల్లో టిక్ టొంటీ పోసి 'చావండి' అందామనిపిస్తుంది.

కాని వాళ్ళ గొంతుల్లో పోస్తే. నేను చచ్చేదెలా? చావు దగ్గర కూడా మనిషికి స్వార్థమే - నా ఆలోచన నాకే, చిరునవ్వు తెప్పించింది.

.... .... ....

కిల్లీ కొట్టువాడు డబ్బులడుగుతూ వుంటే - జ్ఞాపకాని కొచ్చింది చార్‌మినార్ స్టేజీవస్తే, నేను బస్సు దిగి వుండొచ్చుననీ .... కిల్లీకొట్లో సిగరెట్ ఇచ్చి వుండొచ్చునని ....

చేతిలో సిగరెటు వుంది. ప్రక్కనే డబుల్ డెక్ .... కార్లు, రిక్షాలు మనుషులు – ప్రపంచం గోల! దేనితో సంబంధం లేదన్నట్టుగా లైట్లతో వెలిగిపోతున్న చార్‌మినార్! – కొట్టువాడికి డబ్బు లిచ్చేశాను.

ఇంకొంచం సేపట్లో, గదికి చేరుకున్నాక లైట్ వేసుకొని. టిక్ టొంటి త్రాగేసి చార్మినార్‌లా వెలిగిపోవొచ్చు; నిర్జీవంగా - అప్పుడు, కరెంటు కాలిపో తుందే నన్న బెంగలేదు కరెంట్ బిల్లు, రూంరెంటూ యివ్వాలన్న ధ్యాస వుండదు మాటిమాటికి జ్వరం రాదు. అదే పనిగా ఉద్యోగం కోసం అన్వేషించక్క ర్లేదు. ఆకలి వుండదు? ఆకలి కాదు! సరిగ్గా జీతాలివ్వని ఎదురు తిరిగి అడగడం వుండదు. ఫ్యాక్టరీ ఉద్యోగం పీకేయడం వుండదు. మరేమైనా అయితే పోలీ సోళ్ళకు అప్పజెప్పే దుండదు. "ఓరి యాదగిరి! మల్లగిన నీమీద కంప్లెం టొచ్చెనా బత్కవ్ పో" - అని పోలీసోళ్ళు బెదిరించే దుండదు. వీటన్నిటికీ అతీతంగా పోవాలంటే ఒక్కటే – మృత్యువు కావాలి! దాన్ని సాధించాలి. మనసులో ఈ నిర్ణయం పేరుకు పోయినప్పటి నుండి నాలో జ్ఞానోదయం అయినంత సంతోషం నిండింది.

గదికి చేరుకుని తలుపులు తీస్తుంటే; వచ్చే శబ్దం రోజటిలా భయంక రంగా వినిపించడం లేదు. ఏదో వాయిద్యం వాయించినట్లనిపిస్తోంది.

ఈ జీవితాన్ని మలిపేయాలనుకుంటూ ఎలక్ట్రిక్ బల్బు వెలిగించా ....ను కాలుతున్న సిగరెట్‌తో వేళ్ళు చురుకు అంటించుకున్నాయి. అంటే ఇంకా నాలో జీవం వుంది. టిక్ ట్వొంటి త్రాగలేదన్నమాట యింకా - త్రాగాలి! ఈ ఒక్క దమ్మూ సంతృప్తితో పీల్చి తరువాత త్రాగేయాలి.

ఈ సజీవపు వేళ్ళ మధ్య - నిర్జీవపు సిగరెట్! ఒకవేళ ఈపాటికి మృత్యువు నన్నావరించి వుంటే — నిర్జీవపు వేళ్ళ మధ్య జ్వలిస్తున్న సజీవపు సిగరెట్! సిగరెటను చంపాలని క్రిందేసి తొక్కాను-ఎగిరి గంతేసాను. చుర్రుమన కాలింది, అరికాలు, చెప్పులు కూడా కొనుక్కోలేనివాణ్ణి. అందుకేగా ఇప్పుడు చావడం ...

టిక్‌ట్వొంటి సీసా తడక మంచం మీద పెట్టి ప్రక్కనే కూచున్నా ఓ పదేళ్ళ క్రింత నాయన ఇలాగే త్రాగాడు. భక్తి అనబడే మూఢత్వంలో దేశంమీద పడి తిరిగి, అమ్మలూ, బాబాలూ. అనబడే ఈడియట్సుని సేవిస్తున్నా ననే, భ్రమచీకట్లో - తనను తాను మోసం చేసుకుంటున్నానన్న నిజం వెలుగు వెలగకపోతే, ఉన్న భూములు యిల్లూ అమ్మి, అప్పులుచేసి, నన్నూ, అక్కను బికార్లనుచేసి వెళ్ళిపోతూ - నాయన ఇలాగే త్రాగాడు ఏకో - ఆనాడంతా సంతోషంగా కనిపించి, మరునాడు మమ్మల్నేడిపించినా లోకం మాపై సానుభూతి చూపినా, అప్పులెగొట్టి, చచ్చాడనీ .... పిల్ల పెళ్ళి చేయ కుండా చచ్చాడనీ .... బూతులు .... తిట్టినా ఏవీ పట్టించుకోలేదు. అదే నిశ్శబ్దం ... నిర్జీవంగా!

ఛ్. ఆలోచించకూడదు. మళ్ళీ బ్రతకాలనిపిస్తుందో ఏమో త్వరగా త్రాగే యాలి. 'చేతికి నల్లి కుట్టింది' - చిరాకు వేసింది. తొందరలో వున్నప్పుడు డిస్టర్బ్ చేస్తాయా ఇవి? తీసి కాలిక్రింద కసి కొద్దీ తొక్కేసాను. 'మరొక నల్లి కాలును కుట్టింది -' - కసి మరీ పెరిగింది అందరూ నన్ను బాధ పెట్టేవారే - ....

వయసు కోరికలు తీసుకెళ్ళినవోడికి, అక్క నా కళ్ళుకప్పి వెళ్ళిపోతే, నేనెంత బాధ పడింది లోకం పట్టించుకోలేదు. తప్పేదో నాదయినట్లు సిగ్గు శరం లేనివాడని తిట్టింది. చిన్నపాటి ఉద్యోగం యివ్వదు ఈదేశం. యింత తిండిపెట్టని లోకం .... చివరికి, ఈ నల్లి కూడా బాధిస్తుంది? దీన్ని వుట్టిగా కాదు. ఈ టిక్‌ట్వొంటీ చల్లి చిత్రహింస చేయాలి. అనిపించి తీసి ఓచుక్క వేసాను, నల్లిమీద .... కసి తీరింది. కొంత శాంతి.

.... వంకర్లు తిరిగి, లేచిపడి. లేచిపడి దగ్గరకి కుంచించుకపోయి చచ్చింది నల్లి. గర్వంగా ఫీలయ్యాను. దీనిపేరు టిక్‌ట్వొంటికాదు. మృత్యువు!

నవ్వు గట్టిగా వచ్చింది పిచ్చి వాణ్ణయిపోతున్నానా? - కాగూడదు. అయితే టావాలన్న కోర్కె నశిస్తుందేమో. అవునూ? ఒకేఒక్క చుక్కకు నల్లియింత బాధపడుతూ చచ్చింది! నేను అలాగే ఛస్తానా? కొట్టుకుంటానా? అరుస్తానా? - చిన్నప్రాణి కాబట్టి దులిపేస్తే, సరిపోయింది నన్నెవరు తీసుకెళ్తారు కాటికి? ....

ఎప్పుడో సుల్తాన్‌బజారు చౌరస్తాలో చూసిన దృశ్యం. శవం!! - దాని తాలూకు యిద్దరు బిచ్చగాళ్ళు దాని దగ్గరే నిలబడి జనాన్ని అర్థిస్తూ — జనంలోని కొందరు. ఆ శవ దహనానికి విసిరేస్తున్న చిల్లర డబ్బులు .... జ్ఞాపకానికొచ్చి వళ్ళు కంపించింది.

అంతహీనపు చావా? అత నెవరో చస్తేనేం ప్రక్కనుండే బస్సులు మామూలు గానే వెళ్ళాయి. నాయకులు నాయకుల్లాగానే వున్నారు పూలవాడు పూలమ్మాడు. పేపర్లు పంచబడ్డాయి. వాడిచావు ఎవరూ పట్టించుకోలేదు.

అలాగే——

నేను చచ్చినా అంతేకదా, ఇంతకు ముందు ఎక్కిన డబుల్‌డెక్ అలాగే నడుస్తుంది. నే కూర్చున్నచోట - మరొకడెవడో కూచుని, మరేదో అనుభూతి పొందుతాడు——

చచ్చిపోతే——

యింటివాడు తిట్టుకుంటాడు - గది అద్దె యివ్వక చచ్చాడని. అప్పు లెగేసాడని కొందరు ఏడ్చేస్తారు. సానుభూతి చూపరు కదా, యిష్టం వచ్చినట్లు బూతులు తిడతారు నాయనను తిట్టినట్లు - నాయనిలాగే చచ్చాడు - అయితే ఇలా కావాలని మృత్యువును కౌగలించుకోవడం వారసత్వమా? నా లాంటి వాళ్ళకు——

చచ్చేప్పుడైనా సంతృప్తిగా చద్దామనే కదా! ఓ స్నేహితుణ్ణి కాళ్ళవేళ్ళ పడి ఐదు రూపాయలు అప్పు తీసుకుని, హోటల్లో భోజనంచేసి, టిక్‌ట్వెంటీ బాటిల్ కొనుక్కుని, నడవకుండా బస్సు మీద వచ్చింది సిగరెట్ కాల్చింది? ఆ ఐదు యిచ్చిన వాడికే యింకో ముప్పయి యివాల్సుంది వాడే మను కుంటాడు?

లోన ఏదో అంతర్యుద్ధం జరుగుతున్నట్లు ఫీలవుతున్నాను. "మృత్యువును సంతృప్తిగా స్వంతం చేసుకోవాలనుకునే, స్వార్థంతో యితరులకు అసంతృప్తి కలిగించడం న్యాయమా" - మెదడు హృదయాన్ని నిలదీసి అడిగింది. హృదయం 'నేరమే' అని చెప్పడానికి జంకుతున్నప్పుడు.

నా చూపులోకి అడుగేస్తూ - ప్రక్క గదిలోంచి, తీగ ప్రాకి వచ్చినట్లు ఆశ? - యింటావిడ కూతురు. ఛాయన చాయలోంచి బయటపడి, హృదయానికి హత్తుకుపోయే అందం, నోట్లోని మాటల శబ్దాల్ని లాగేసింది.

ప్రక్కనున్న బాటిల్ చూసింది కాబోలు "మీ రూంలో నల్లులమందు కొడుతున్నారా - ఏంది మరెక్కడ పడుకుంటారు?" - ప్రశ్న వేసి "ప్రక్క గది ఖాళీగానేవుంది, వొచ్చి పండోండ్రి" - అనే మాటలు "నా హృది ఖాళీగనే వుంది, వొచ్చి పడుకోండ్రి" - అన్నట్లు వినిపించి, సంతృప్తి మెల్లగా నిండింది హృదయంలో—

బయటినుండి చల్లగాలి వీస్తోంది. చేతిలో ఆశతెచ్చిన పసుపుపచ్చ పొడుగు కవరులో, జీవితాన్ని మంచివైపు మళ్ళించే శక్తి వుండొచ్చు—

మనిషి ఎలా బ్రతికాడన్నది కాదు - ఎలా చచ్చాడన్నది ముఖ్యం - నిజమే! ఇవ్వాళ చేయదల్చుకున్న మంచిపని రంగు మార్చుకుంది .. ఊసరవెల్లిలా—

మనసులో పరుగులీసిన చెడ్డ ఆలోచనల్లా - మంచం మీద నల్లులు పరుగులు తీస్తున్నాయి—

అవును. వాటిని చంపాలి !

ముందుకొట్టే పంపు మంచం క్రింద వుండొచ్చు - తీయాలని లేచాను.

1974

—